శ్రీ

Reg. No. M. 2580

సం॥ చందా రు ౪ లు.

జమీందారీ రయితుల ఆర్థిక సాంఘిక వ్యవసాయిక భాగ్యోదయమునకు

సంపుటము ౨ | శనివారము ౩౧–౧౨–౩౨ | నెల్లూరు | సంచిక ౧౩

ఇదియా మాటనిలకడ?

—o—

యువరాజా!

వెంకటగిరి తాలూకాలోని ధాన్యపు రేట్లుగల 24 గ్రామాదుల రైతులము ఏకమై గత పదేండ్లనాడు ధాన్యపు రేట్లు రొక్క రేట్లకు మార్చుమని మీ మీద దావా చేస్తిమి. అప్పట్లో మీకు మాకు జరిగిన రాజీలో తరము 1-కి 1 తూము వంతున తగ్గింపు రేట్లుతో తిరుగా ధాన్యపు రేటుకు మమ్ముల ఒప్పిస్తిరి. నాడు మాకు యిష్టములేకున్నను మీరు బెట్టుబాధలు పడలేక అంకీకరించితిమి.

ఆప్రకారము కొన్ని ఫసలీలు మాత్రము జరిగినది. తర్వాత 1333 ఫసలీసుక్కీ బంజరు ముజరా సందర్భముగా పైన రాజీగా తగ్గించబడిన రేట్లను తిరుగా కొంత హెచ్చించుకొన్నగాని ముజరా లివ్వమనియు, ఇతర నిర్బంధములు చేతుమనియు, కంచెల నివ్వమనియు బాధించిరి. గత్యంతరములేక దేముడాయని యేడుస్తూ ఒప్పుకొంటిమి.

మొదట రాజీలో తగ్గించబడిన రేట్లు దిట్టములో కూడా తగ్గించబడినను తిరుగా 1337 ఫసలీ మొదలు తిరుగా హెచ్చించి వసూలు ప్రారంభించిరి. ఈ హెచ్చించబడిన ధాన్యము సుమారు సం॥ 1-కి 200 పుట్లు వంతున న్ను 1337 ఫసలీ మొదలు ఇప్పటివరకు జరిగిన 6 ఫసలీలకు 1200 పుట్లుధాన్యము హెచ్చు యివ్వవలసినట్లు ఏర్పడినది. ఈకరవు కాలములో, ధాన్యమునకు పూర్తిధరలు పడిపోయిన కాలములో, పంటలు సరిగా పండని కాలములో, ఇంతధాన్యమును హెచ్చించి అక్రమముగా సాగుచున్నదిగదాయని చేయుట ఎంతటి నీచతమమో యోచించవలెను. మొదలు తగ్గించినామని రాజీగా ఒప్పుకొన్న నోటితోనే తిరుగా అక్రమంగా హెచ్చించినామని చెప్పుట తమబోంట్లకు తగనిపని. అందరును అబద్ధము చెప్పక నిజము చెప్పుమని తాము మన్నారు పోలింగు మీటింగులో ప్రజలకు బోధిస్తిరే! ఇది తమకు వర్తించదుకాబోలు? ప్రజలకున్యాయ మార్గమును బోధించవలసిన తమరే యీఅన్యాయములకు దిగిన సామాన్య మానవుల విషయము చెప్పవలసినదేమున్నది?

మమ్ముల నిట్టి బాధల పాల్జేయుచున్న తమరు జిల్లాబోర్డుకునిలువబడి ఓట్లు తెమ్మని మమ్ముల నడుగుటకు తమ కెట్లు మనస్సు ఒప్పినదో ఈశ్వరునికే యెరుక.

ఇకనైనను తమరు చెప్పినమాటలను జ్ఞప్తి పరచుకొని ఈపేదజనమునకు పైహెచ్చుచేసిన అక్రమ ధాన్యమును వెంటనే మాఫీచేసి వసూలుచేసిన మట్టుకు మాకు ముజరా యిప్పించి మాకడుపులు మాడ్చక మీ మాట దక్కించుకొందురని ప్రార్థన.

చిత్తగించవలెను.

ధాన్యపు రేట్ల గ్రామాదుల రైతులు.

జమీందారీరైతు

శనివారము.

౩౧—౧౨—౩౨.

జమీందారుల భావిస్థితి

పైమనుటముతో పీఠికాపురయువరాజుగారు మాడర్న రివ్యూలో వ్రాసిన వ్యాసమునకు భాషాంతరీకరణము స్థలాంతరమున కానవగును. యువరాజుగారి వ్యాసము జమీందారుల భావిస్థితిని చిత్రించుచున్నది. విద్యాధికులగు యేయొక రిద్దరో దక్క యీరాజధాని జమీందారులందరు ఒకేవిధమున నిద్రించుచున్నారు. పూర్వపు నిరంకుశ పాలనమే సాగవలెనను దివాంధులు యింకను పొడగట్టుచుండుట దేశదౌర్భాగ్యము. అధికార యుతులగు స్వదేశ సంస్థానాధీశులకంటె జమీందారుల నిరంకుశత మిన్నుముట్టుచున్నది. రయితులను తమకుభోగభాగ్యముల నిచ్చుటకు సృజింపబడిన బానిసలుగా కాలిక్రింద త్రొక్కబడియున్నారు. జమీందారులలో చాలామంది తగినవిద్యా, శిక్షణల కొఱవడి యుంటయే ఇందుకు కారణము. వెంకటగిరి, పర్లాకిమిడి జమీందారీలలో జరుగు అన్యాయములు వెలువరించిన గుండెలు బ్రద్దలగును. ముందున్న గొయ్యిని గానక ప్రవర్తించుట హ్రస్వ దృష్టిని నిరూపించును. యువరాజుగారి హితవు కూపస్థ మండూకములకు నెగటుగా నుండుట సహజమే! యువరాజైనను జమీందారుల మేల్కొల్పు చున్నాడు. అధికారము లెట్లున్నను ఆస్థితినయినను దక్కించుకొమ్మను చున్నాడు. లోకమునకు గనుపడు వ్రాఘూత్కారమును మార్చుకొని రయితులతో కలసి మెలసి యుండమను చున్నాడు. అంతేగాని రయితుస్థితి గతుల విమర్శించుటలేదు. నేటిదిక్కుమాలిన రయితును యీస్థితికి తెచ్చినందుకు తమజాతి వారి దౌష్ట్యమునకు కన్నీటి బొట్టయినను వదలుటలేదు. భావికాలపు జమీందారును జూచి వీరు జాలికొనుచున్నారే గాని తరతరములుగాపీల్చిపిప్పిజేసి ప్రాణమాత్రావశిష్టునిగజేసిన జమీందారుల దారుణమునకు జాలిగొనుటలేదు. ఈహిత వయినను వెంకటగిరి కుమారరాజాగారికి గిట్టకుండుటలో నాశ్చర్యములేదు. పీఠికాపుర యువరాజుగారి వ్యాసములోనను, వెంకటగిరి కుమారరాజాగారి జవాబులోనను, ఇతరులు పొరపులు పుట్టించుచున్నారని యెత్తి పొడుచుచున్నారు. వీరియూహలో ఈపొరపులు పుట్టించుచున్నది, రష్యా మొదలగు విదేయులు కానిచో చుట్టుప్రక్కల కష్టసుఖముల పంచుకొనవలసిన యితర రయితులు. తోడిసోదరుల కష్టములు విచారించుటకు వాకిండ్లముందరకు వచ్చుచున్నారను నదియే వీరువెరపునింద. తమకుసర్వభోగ భాగ్యములనిచ్చు రయితు సురభిని కడుపుమాడ్చి అల్లోనారాయణాయని జీర్ణకుటీరములలో యేడ్పించుచు పైకి చెప్పుకొనుటకు సయితము దిక్కులేకుండ జేసినప్పుడు ప్రక్కనివసించు రయితు యీకుటీర వాసికన్నీరు తుడిచి "ఏమినాయనా నీకష్టముల" నిఓదార్చి అతనికడుపులోని తుకథను లోకమునకు ప్రకటించి నారనునదియే వీరికడుపుమంట. లోకములన్నియు స్వాతంత్ర్య దీపములు వెలిగించు కొని యీశ్వరదర్శనము జేసుకొనుచున్న యీదినములలో చుట్టుప్రక్కల వెలిగించుకొన్న దీపకళికల నట్టిత్తియైన చూడజాలక నిర్బాధములపాలై కుములుచున్న యీజమీందారీ రయితుల రోదనములు నేడుగాకున్న రేపయినను లోకముకాంచదా? తమతప్పును గుర్తెరుగ జాలకయితరులపైబడి యేడ్చుటేల? రయితుల సర్వకష్టముల పాల్జేసి వారుచెప్పుకొను గోడునైనను విచారించ నుత్సహించని మాకుమారరాజాగారు ఇతరులపయి నిందను మోపిన మోపుదురుగాక, పీఠికాపురమువారు మోపుట మాత్రము సమంజసముకాదు. వెంకటగి కుమారరాజాగారి వ్రాతలో మధ్యవర్తిసంఘముద్వారా రయితులు, జమీందారులు తమతగవులు నిర్వర్తించుకొనవచ్చునను చున్నారు. వెంకటగిరి తకరరుల తీర్చుకొనుటకు రయితులు వేలపర్యాయములు ప్రయత్నించినను రాజీకి సిద్ధపడక రాయబారముల కాలదన్నిన మాకుమారరాజాగారు యీవ్రాతలువ్రాయుట అర్థవిహీనము. నేటికయినను తమ నద్దకు రానున్న రయితుల రాయబారమును త్రోసిపుచ్చక తమ యింటిని ముందు చక్కబరచుకొందురని కోరుచున్నాము.

కుమారరాజాగారు, యేమి ఉపకారముచేసిరి?

గుంటూరు జిల్లాబోర్డు ప్రెసిడెంటు కుప్పుస్వామి చౌదరిగారు ఏపార్టీకి చెందినవారయినను జిల్లాప్రజలకు వారు జేసిన సేవ ఆశ్చర్యమును గలిగించుచున్నది. దర్శిడివిజనుకు ఉత్తరము, తూర్పు, కాలిడినచో వారిసేవ ప్రత్యక్షముగను యెవరికి జూచినను రోడ్లమయమే!

మా జిల్లాబోర్డు ప్రెసిడెంటుగారు యీవిషయమున జూపిన యుదాసీనత జిల్లాప్రజలు తర తరములవరకు మరచిపోరు. అధ్యక్ష పదవి నలంకరించినదాది జిల్లాబోర్డు ఆఫీసు మేడమెట్లెక్కుటకే తీరికలేని వీరు జిల్లాలో సంచరించి ప్రజల కోర్కెల మన్నించ లేదనుట పొరపాటు. జిల్లాబోర్డు మీటింగులకు సయితము హాజరుగాక సభ్యత్వమును, దానితోటి అధ్యక్షపదవిని, గోల్పోవుటయే వీరి యుదాసీనతకు తార్కాణ.

ఇందుకు కారణముగద్దు. ఇతర జిల్లాబోర్డు ప్రెసిడెంట్లు హృదయ పూర్వకముగా ప్రజలపయిగల ప్రేమ యెట్లున్నను తిరుగా ఓట్ల సంపాదనకయి ప్రజల ముందరకు వెళ్ళినప్పుడు తాము ఉదాసీనత వహించినచో యేమి సమాధానమిత్తుమాయని భయముకద్దు. కావున తమ కాలమున ఏవయినను కొన్ని మంచి కార్యములు చేసి చూపెట్టి ప్రజలకడ తమ మానము దక్కించుకొందురు.

మాబోర్డు ప్రెసిడెంటుగారు పుట్టుభోగియయి లోకదూషణలకు వెరువక పేదవారల జీవనమును సరకుసేయక తమ నిరంకుశతనే ఆచంద్రతారార్కము చిరస్థాయి జేసుకొన ప్రయత్నించు జమీందారుల తెగకు సంబధీంకులు. తగిన విద్యాధిక్యతయూ మృగ్యము. సలహాదారులా లంచగొండి మిరాసిదారులగు ఉద్యోగులు. కావున లోకవృత్తము నేమాత్రము గమనించలేరు. యింతేగాక తాము జమీందారు పుత్రులగుటచే తమదుర్మార్గ నౌకరులే ఓట్లు సాంపాదనము జేతురు. కావున ప్రజల కడకరిగి సారంగనీతులు దిద్దవలసిన జాతకము పట్టుటలేదు. యేశాసనసభాయెన్నిలయినను వచ్చినచో అట్టితరి అ-

జమీందారుల ముందుస్థితి.

పిఠాపురము మహారాజా గారగు శ్రీ ఆర్. వి. యస్. జి. రామారావుగారు మాడరన్ రివ్యూ పత్రికకు యిట్లు వ్రాయుచున్నారు:—

నేడు భారతదేశములో కేవలము నాశనోన్ముఖమైన సంఘము నేదైనను కలదన్నచో నది జమీందారు లనవలయును. జమీందారులకు కొలదికాలములోనే చేరువలో నున్న పతనము వర్ణనాతీతమయి యున్నది. వివేకము గల జమీందారు డెవ్వరయినను తన భావికాలము గూర్చి పర్యాలోచనము గావించుకొన్నచో భీతావహము పొడముట తప్ప వేరేమియును గానిపించుట లేదు. కాని నేడు భూస్వాములని పిలువబడుచున్న యీ జమీందారులలో భావిని గూర్చి యాలోచించుకొనువారే తక్కువ. వారియందును బుద్ధివయిన పద్ధతిలో నాలోచించువారంతకంటె తక్కువ. ఒకవేళ నిట్టివారు కొందరున్నను, వారిమాట అశ్రద్ధాలసులయిన యధిక సంఖ్యలలో చెల్లి కెక్కుట లేదు. జమీందారు లిప్పుడు జాగ్రత్తగలిగి రానున్న మహాపదను దప్పించుకొనుటకు మానుట నీదేశములో జమీందారుల యూరుపేరులు లేకుండ చేయబోవుచున్న ప్రధాన సమస్యలకు లెక్కసేయక నిద్రించుచున్నారు. జమీందారుల యీ యశ్రద్ధకంటె నవివేకమయిన విషాదకరమయిన కృత్యము వేరొక్కటి లేదు. ఈ యజ్ఞానమునకు, ఈ తృణీకరణమునకును వారు తగిన ఫల మనుభవింపవలసి యున్నది. ఇప్పటికైనను జమీందారులు మేల్కాంచి, వచ్చిన వాని పెండ్లికి వచ్చినదే కట్నమనినట్లు కొంతయయినను జాగ్రత్త పడవలసి యున్నది. జమీందారుల రోజులు గతించినవి. వారిపతనము తప్పదు. పతనము వచ్చుగాక, జమీందారులు దానిని సర్వవిధముల నిరోధింపకుండ లొంగిపోకుందురు గాక!

పూర్వపు రోజులు గతించినవి. ప్రభువుల యౌదార్యమును, రయితుల భక్తియు నిప్పు డస్త గతప్రాయము లయినవి. ఏక రాజకము, దాని నిరంకుశత్వమును వెనుకటి సంగతులు. నేడు ప్రజాస్వామికము సర్వాతిశాయియయిన యాదర్శమయినది. ప్రభుసేవకు లన్నశబ్దములే యపహాస్య పాత్రము లగుచున్నవి. స్వాతంత్ర్యము, సమానత్వము సోదరత్వమునను మహోద్యమములు శ్రవణ గోచరము లగుచున్నవి. మహాశక్తి వంతములైన ప్రభుత్వములు గూడా ప్రజా స్వామికములుగా మారిపోయినవి. ఏకరాజకచ్ఛాయ యింకను నిలువకున్న యింగ్లాండు, జపాను దేశములలో గూడ నిజమైన యేకరాజకము లేదు. ఆదేశములలో ప్రజాస్వామిక తుల్యమైన యేకరాజకములు సాగుచున్నవి. ఫ్రాన్సులోని బోర్బను రాజన్యులస్తమించిరి. ఆస్ట్రియా యందలి హేప్సుబర్గు సమ్రాట్టులు పోయిరి. రష్యా మహాసామ్రాట్టు ప్రపంచ విస్మృతుడైనాడు. లోకమును గబళింప నిశ్చయించిన జర్మనీ కెయిజరు చక్రవర్తి, దేశగానివాడై యొకమూల గూర్చున్నాడు. స్పెయిను రాజు ప్రవాస మనుభవించుచున్నాడు. ప్రపంచములో రాజకీయ భావ పరిణామమంతయు స్వాతంత్ర్యమును, ప్రజాధికారమును లక్షించుచున్నది. పాశ్చాత్యదేశము లందైనను, పౌరస్త్య దేశములందైనను ప్రజాస్వామికాదర్శము లే ప్రజాదరమునకు పాత్రము లగుచున్నవి. ప్రపంచ పరిస్థితు లిట్లుండగా భారతదేశములో జమీందారులకు కష్టకాలమువచ్చి పడినదనుటలో నాశ్చర్యములేదు. అంత లంతలు మహాప్రభువులే పడిపోయినప్పుడు చిన్నజమీందారుల స్థితి యెట్లుండునో తేలికగానే యూహించుకొనవచ్చును. నిజమునకు రష్యావంటి పరిపూర్ణ ప్రజాస్వామికములో జమీందారునకు గౌరవాస్పదమైన స్థానములేదు. మతిరష్యా భారతదేశమునకు హంపాయి దేశమేగదా! రష్యావారు భారతదేశమున సమిష్టివాదమును ప్రవేశపెట్ట నిశ్చయించుకొన్నచో వారట్లే చేయుదురు.

భారతదేశములో సమిష్టివాదము గాని, బోల్షివిజము గాని ప్రబలినచో జమీందారులును, సంతకంటె బలవంతులైన సంస్థానాధిపతులును దుడిచి వేయబడుదురు. అప్పుడు వారి నెవరియును రక్షింపజాలరు. కాని యిది యెప్పుడో రానున్న మహాప్రళయము.

సమిష్టివాదము రాకపోయినను జమీందారుల పతనము తప్పదు. ప్రజలకు జమీందారులన్నచో నిష్టములేదు. జమీందారుల సొంతరయితులే వారిని వినుముకలె జూచుచున్నారు. ముందుముందు భారత శాసన సభల యందు గాని, రాష్ట్రీయ శాసన సభలయందుగాని, రయితులును, ప్రజాప్రతినిధులును నధిక సంఖ్యలయి యుందురు. పెత్తన మంతయు వారిదే యగును. స్వతంత్రమైన శాసన సభలో మెజారిటీ వారు వారి యిష్టము వచ్చినట్లు చేయగలరు. స్వపరిపాలనము గల దేశములో, రాజకీయ రక్షణలని పిలువబడునవి వట్టి నిష్ఫలములై యుండును. ఏ సంఘమునకైనను ప్రజల సద్భావమే తగిన రక్షణ మగును. కాని దురదృష్టవశమున ప్రజలు సద్భావమును బడయుటకు మన జమీందారుల కట్టి యవకాశమును లేదు.

శాసన సభలోని ప్రజా ప్రతినిధులు, జమీందారులను ప్రజలకును, రయితులకును, విరోధులుగా బరిగణింతురు. కాని జమీందారులు నిజముగా ప్రజలకు విరోధులు గానక్కరలేదు. జమీందారుడును, రయితును నొక వస్తువుయొక్క స్వరూపద్వయమే. ఒక్క మొక్కను బుట్టిన పువ్వుల జంటయే. వారు పరస్పరాభ్యుదయము కొఱకు సహకరించు సహచరులు కావలయును. కాని యిది చాల మేలెంచు నూహ. ఇది యుండవలసిన పద్ధతిగాని యిప్పుడున్న పద్ధతికాదు. ఇప్పుడు జమీందారుల పార్టీ రయితులపార్టీ యను రెండు పార్టీలున్నవి. జమీందారులు రయితులపై ననుమానము వహించుచున్నారు. రయితులకు జమీందారులపై విశ్వాసము లేకున్నది. ఈ పరస్పర విశ్వాసము లేకుండుట సర్వ నాశనకరమగును. ఇట్టి పార్టీలు లేనిచోట గూడ స్వార్థపరులు కొందరు కుట్రలుచేసి పోట్లాటలు పుట్టించుచున్నారు. ఈ విధముగా జమీందారులు ప్రజల విశ్వాసమును గోల్పోయిరి. ఇందు కొంతవఱకు రయితులే కారకులైనను, కొంతవఱకు కీర్తిశేషులగు జమీందారులు గూడ కారకులే యగుదురు. కాని యీ బాధ్యత యంతయు నెక్కువ భాగము వీరిద్దరకును పొరపులు పెట్టుచున్న మధ్యస్థులకు చెందవలసియుండును. ఇంతకును దీని కెవ్వరు బాధ్యులైనను వచ్చిన యాపద మాత్రము చాల విపరీతమైనది. రయితుల ప్రతినిధు లెప్పుడును నధిక సంఖ్యాకులై యుందురు. గావున, వారు తమ విరోధులైన జమీందారులపై సర్వవిధముల కసిదీర్చుకొని నాశనము చేయజూచెదరు. జమీందారుల కపకారములైన శాసనములు చేయబడును. జమీందారులకు పెద్ద పెద్ద పన్నులు వేసి క్రొత్తగా జమీకి వచ్చిన వారెల్లరును వారసత్వపు పన్నులు గట్టవలయు నని విధించెదరు. ఈనాడు సర్వదేశములందును, భూమియంతయు ప్రభుత్వాధీనము కావలయు ననుట ప్రస్ఫుటాదర్శమగు చుండుటవలన జమీందారుల జమీలను స్వాధీన పరచుకొందురు. జమీందారుల రాజగృహములు బీదలకు నివాసయోగ్యములు గావింపబడును. వారియాస్తి, బిరుదములు' దర్జాల నన్నిటి నూడదెరికి దరిద్రులు గాజేసి వెడల గొట్టెదరు. అప్పుడు రయితు లెల్లరును "వీరికి తగినశాస్తి జరిగినదిలే, మనల నెల్లరిని సర్వవిధముల వేధించు కొనితిన్నా" రని సంతోషింతురు. అప్పుడు జమీందారులు, "కావచ్చును. కాని మాకిట్టి యపచారము జరుగవచ్చునా" యని విలపింతురు.

అప్పుడు రయితును మెచ్చుకొనవలయునో జమీందారుని జూచి జాలి నొందవలయునో, వివాదగ్రస్తమైన విషయము. అది విమర్శకుల యభిరుచిని బట్టియుండును. కాని జమీందారుల భవిష్యత్తుమాత్రము మాపత్సంకులమై యున్నది. ఇందెవ్వరికైన సందేహమున్నచో వారొక్కసారి వెనుదిరిగి సింహావలోకనము చేసికొనదగును. చరిత్ర పునరావృత్తి నొందును. రయితులకును, సామాన్య ప్రజలకును దేశముపై సర్వాధికారములును లభించినప్పుడు క్రోధోద్రిక్తులైన వారి చేతులలో జమీందారుల, భూస్వాముల గతి యెట్లగునో తెలిసికొనుటకు ఫ్రెంచివిప్లవమే నిదర్శనము. వారిచేతలను గాదనుటకు గాని, వారి నదమాయించుటకు గాని యెవ్వరు?

అంతకంటె నిటీవల జరిగిన రష్యాను విప్లవమును గమనించినచో జమీందారులకు రానున్న మహాపదను జక్కగా దెలియనగును. రష్యాలో రాజకుటుంబము వారెల్లరును హత్యచేయబడిరి. రాజవల్లభులెల్లరికిని గలసర్వస్వము స్వాధీనము చేసికొ

నిరి. వారుప్రాణములను గాచుకొనుటకై పరదేశములకు పాఱిపోవలసి వచ్చినది. నేడువారు విదేశములలో నానా నీచ కృత్యములను గావించి పొట్టపోసికొన వలసి వచ్చుచున్నది. రష్యా జమీందారులు కొందరు ప్యారిసు మున్నగు నగరములలో హోటేలులను కొలుచున్నారు. వారిలో మఱికొందరు సముద్రపు టోడలలో చిన్నయుద్యోగులుగా పని చేయుచున్నారు. వారికుటుంబము లు విదేశములలో దిక్కులేక యల్లాడుచున్నారు. ఇట్టి నీచస్థితి వారు తగినదియైనదో, లేదో మఱివేఱుసంగతి. కాని యీ యుదాహరణములచేత రష్యా విప్లవము యొక్క కార్యకారణ భావములను చక్కగా బరిశీలించుకొని, జమీందారులు తరుణ రానున్న యాపత్తు స్వరూపమును సరిగా గ్రహించుకొన గలరు. మన భారత దేశపు మహారాజులు గాని, జమీందారులు గాని, లండనులో పండ్లమ్ముచునో, లేక హోటెళ్లలో సందైన చెప్పులు తుడుచుచునో కాలక్షేపము సేయుచుండ, వారి భార్యబిడ్డలు వంటసాలలలో బనిచేయుచుండు దృశ్యమునొక్కసారి మీభావనా వీధుల స్మరించుకొనుడు! ఇది విషాదకరమైన దృశ్యము. కాని యెప్పటికో యిది నిజముగ జరుగునదియే.

అంతయుం సంవత్సరమైన బూర్తిగాగడవలేదు, స్పెయిను దేశము నందేమి జరిగినదో మనముచూచనే చూచితిమి. అక్కడి జమీందారుల బిరుదుల న్నియు నూడ బెఱుక బడినవి, వారిధనమును స్వదేశ బ్యాంకుల నుండి తీసి, విదేశ బ్యాంకులలో వేసికొనుట కనుజ్ఞ నీయ లేదు. దేశద్రోహులని యనుమాన మున్నవారి యాస్తులన్నియు స్వాధీనము చేసికొన బడినవి. ఇంగ్లాండు వంటి కన్సర్వేటివు దేశములలో గూడ ఆంగ్లేయ జమీందారులపై పెద్ద పెద్ద పన్నులను విధించి, వారిని గూడ సామాన్యపు రయితుల స్థితికి దీసికొని వచ్చుచున్నారు. వారసత్వపు పన్నులు మున్నగు వాని భారము వలన జమీందారు లాస్తులను, గృహములను అమ్ముకొనవలసి వచ్చుచున్నది. వారుపూర్వపు దర్జానంతయు నిలబెట్టుకొన లేక దివాలా తీయదగిన స్థితిలో బడిపోయినారు. ఇదియంతయు జమీందారుపై ప్రజలకుగల యసహ్యభావము వలననే పుట్టినది. కావున ప్రపంచ చరిత్రను సామాన్యముగనైన దెలిసికొన్న వివేకవంతుడైన జమీందారు డెవ్వడును తన వారికి మంచి రోజులు ముందు రానున్నవని విశ్వసింపడు. పూర్వోక్తమైనరీతిని జమీందారుల ధనము, భూములు భవనములు నన్నియు స్వాధీనము చేసికొనబడును. ఇకవాని బిడ్డలును, కుటుంబమును ప్రాణములతో వదలి పెట్టినచో ఈశ్వరానుగ్రహమే యగును. ఇది పట్టియూహా వలన జనించిన భయముగాదు. ఇదికేవలము భవిష్యత్తున సంభవింప దగు గొన్ని యథార్థ విషయములను బట్టినిర్ణయింప బడిన విషయము.

ఇక "జమీందారు లేమి చేయవలయును" నను ప్రశ్నను బరిశీలింతము. జమీందారులకు బూర్వపు స్థితి మారినదని గ్రహింపవలెను. ఇక గర్వము మాపుట కవకాశములేదు. పరు లెవ్వరో వచ్చి గర్వము దించుటకు మునుపు, జమీందారులు తమంతట తామే వినయము వహించవలయును. నిరంతరమును గష్టించుచున్న ప్రజలతో సంబంధము లేక దివినుండి దిగి వచ్చిన వారివలె దూరముగా నుండుటకు వీలులేదు. రయితులతోడను, ప్రజలతోడను గలసి కట్టుగానుండి, వారి కష్ట సుఖములలో బాల్గొనవలయును. రయితులు వట్టి మోటువారని గొణిగి నందువలన బ్రయోజనములేదు. నిజమునకు జమీందారు లెల్లరును మహానాగరకులా? నిశ్చయముగ గారు. నాగరకత యన నాత్మ వయిభవము గాని బాహ్య వేషభాషా ప్రపత్తి కానేరదు, జమీందారులలో బలువురికి దీని కూడ లేదు. ఇట్టి యాత్మ వైభవము రీవలయుండును ధనవంతుల యందుండు నొక్కచే విధముగ నుండును. అదియును గాక బ్రతుకుటయే భర మయినప్పుడు నాగరకత మాట యెక్కడనుండి వచ్చును. జమీందారులు రయితుల కష్టసుఖములలో బాల్గొని, తాము గూడ వారిలోబాటు వారమే యని తలంప వలయును. జమీందారులే ప్రజలకు సహజ నాయకులు కావలయును. వారు లఫాయట్టీ, టాల్స్టాయిల ననుకరింప వలయును. అప్పటికిని రయితులకు జమీందారులపయి విశ్వాస ప్రేమలు జనించు ననుట సంశయము. ప్రజలలో వీరిపయి ద్వేషభావ మంతగా నాటుకొని పోయినది. ఇట్టి దానికి బుద్ధిహీనులును క్రూరులు నయిన కొందరు జమీందారులు తగియుండ వచ్చును. కాని సత్పురుషులు దయా హృదయులు నయిన వారుగాడ తామెఱుగని తప్పులకు శిక్షననుభవింప వలసి వచ్చును. ఎట్లయినను జమీందారు లనేక విధములఁ బ్రజల హృదయములను స్వాధీనము చేసికొనుటకు బ్రయత్నింప వగును. కొందరు ప్రజలయినను వారిని ప్రేమింతు రనుటకు కవకాశ మున్నది. కాని వారు స్వార్థము కొఱకు ప్రజల మనస్సులను స్వాధీనము చేసికొనుటకు బ్రయత్నింపగూడదు. ఇందు ద్రోహబుద్ధి కూడదు; వారి ప్రజాప్రేమ నిష్కల్మషమై నిర్వ్యాజ మయినది కావలయును. దానికి దగిన బహుమానము వచ్చినచో గృతార్థులని తలంప వచ్చును. లేదా యది వారి తప్పుకాదు. అప్పుడును నాచేత నయినంత సత్కార్యములు చేసితిని గదా యని సంతృప్తి నందవచ్చును.

ఈ రోజులలో స్వాతంత్ర్యోద్యమము విజృంభించు చున్నది. వేలకొలది జనులు లాటీదెబ్బల వలన గాయములను లెక్కసేయక జయిళ్లలో ముక్కి పోవుచున్నారు. దేశభక్తులీ జాతీయ సంగ్రామములో వారి ధనమును, ప్రపత్తిని, ఆయతిని, ఇండ్లను, ప్రాణములను దేశముకొరకయి సమర్పించు చున్నారు. ఎవరో కొందరు తప్ప, తక్కిన జమీందారు లెల్లరును జాతీయోద్యమాభివృద్ధి కేమి చేసిరి? వారు కేవలము దయవలన నయినను నొక్క పయిసయైన నిచ్చిరా?, లేక జెయిలులో నింత దుఃఖము ప్రవర్తిల్లు మందగా సానుభూతితో నొక్కకన్నీటి బొట్టయినా విడచిరా? ఆమాట తలపగూడదు. జమీందారు లీవిషయమున పెద్ద సంకటావస్థలో బడి వారిని యొప్పుకొనక తప్పదు. ఈస్వాతంత్ర్యోద్యమమునకు సహాయము చేయవలయునా, లేదా యను నదియే ప్రశ్న. 'స్వార్థము' పిరికితనము, దేశభక్తిని, ధైర్యము ను జూపకుండ జేయుచున్నవి. జమీందారులు ప్రజలకు సహజనాయకు లగుటకు బదులు వారితప్పు కులైనారు. స్వాతంత్ర్యముకొఱకు జనించిన జాతీయ ప్రబోధము నడగ ద్రొక్కుటకు బ్రయత్నించు చున్న మహాశక్తిలో జమీందారులు గూడ ఏకమైనారు. వెనుక ఫ్రెంచివిప్లవములో జమీందారు లెట్లుండిరో యిప్పుడు మన జమీందారులు గూడ నట్లేయున్నారు. ఇట్టి స్థితిలోనే యింకను నుండినచో దానిఫలితముల ననుభవించి తీరవలయును. కాని మన జమీందారు లింగ్లాండు జమీందారుల పద్ధతి నవలంభించుట శ్రేయస్కరము. బ్రిటీషు జమీందారులు ప్రజలకు నాయకత్వము వహించి, వారిహక్కుల వార్జించి పెట్టిరి. మతగురువులును, ప్రభువులును గూడ ప్రజల హక్కులకై పోరాడి జాన్ రాజు చేత మాగ్నా కార్టామీద సంతకము చేయించిరి. తర్వాత 1688 సంవత్సరము నందలి విప్లవము నందు గూడ ప్రభువులు నాయకత్వమును వహించిరి. తుదకు పోమన్సు ప్రభువే రిఫారమ్సు బిల్లును వ్రాసెను. ఈ విధముగా వారు కొంత కొంత స్వార్థబుద్ధితో నైనను ప్రజాసేవ గావించి తాత్కాలికముగ నైనను వారి యభిమానమును సంపాదింప గల్గిరి. కాని మన జమీందారులకు దేశమును సేవించుట కట్టిధైర్యము లేదు. అదియును గాక ప్రజల ప్రవృత్తులను సరిగా నెఱింగి వారిని సేవించుటకు మన జమీందారులు పరదేశీయులను జూచి నేర్చుకొన నక్కరలేదు. మన శాస్త్రములను, ప్రాచీన పురాణాదికములను జూచినచో నీ సంగతి విదితమగును. మన పూర్వులు ప్రజల కొఱకు ప్రాణములను సహిత మర్పించిరి. రాజోత్తముడైన రామచంద్రునకు ప్రజాసేవయే ప్రధానలక్షణము. ప్రజా ప్రీతి కొఱకు శ్రీరామచంద్రమూర్తి సీతాదేవిని వనవాసమునకు బంపుటకు గూడ వెనుదియలేదు. భార్యా పరిత్యాగము దోషమే కావచ్చును గాని, యాయన ప్రజా సేవాదర్శము మాత్రము లోకోత్తరమైనది. అట్లే ఛత్రపతి శివాజీ మహారాజు గూడ ప్రజలను మొగలుల దౌష్ట్యము నుండి తప్పించుకొనుటకై రాత్రింబవళ్ళును నిద్రాహారములు లేక పోరాడలేదా? కావున ప్రజలు ద్వేషింపకుండ జేసికొనుట జమీందారుల విధి. బ్రిటీషు రాజుల యెడ జూపిన భక్తియంతయు వృథాయైనది. ప్రధాన మంత్రిసాంఘిక సమస్యను గుఱించి యిచ్చిన తీర్పులో జమీందారులకు శాసన సభలలో సరియైన ప్రాతినిధ్య మొసంగకుండుట వలననే సంగతి బయటబడి పోయినది. ప్రస్తుత శాసనము లన్నియు గూడ జమీందారులకు విరుద్ధములుగానే యున్నవి. ఈవిధముగా జమీందారులకు ప్రజల ప్రేమగాని, ప్రభువుల యభిమానముగాని లేకున్నది.

కావున నికనైనను జమీందారులు తప్పులను దిద్దుకొన దగిన సమయము వచ్చినది. వారు స్వార్థముల నన్నిటిని బరిత్యజించి యంతరాత్మ చెప్పినట్లు ఆలోచన నిమగ్నులై యెల్లరికిని సద్యశ్యముగ లభించు నా యంతర్వాణి చెప్పినట్లు ప్రవర్తింపవలయును. జమీందారులు తమ కష్ట సుఖము లన్నియు ప్రజలతోడివేయని గ్రహించి ధర్మబద్ధములైన ప్రవృత్తుల న్నిటియందు వారికి సహాయము చేయవలయును. ప్రజలసుఖమే తమసుఖము, వారి దుఃఖమే మన దుఃఖముగా బ్రవర్తింపవలయును. జమీందారులును, ప్రజలును గూడి యేకోన్ముఖులు గావలయును. పూర్వాపచారముల నన్నిటిని క్షమించి విస్మరించుటయే వారి లక్ష్యము కావలయును. జమీందారు లిట్టి పరస్పర గ్రహణము వలననే సుఖజీవనము జరుగగలదు గాని, జమీందారీ దర్జావలన గాదు.

మాయకులగు సామాన్యప్రజలకడ కరిగి యే తుంగభద్రకాలువో పారిదుచున్నవాలు. ఇట్టి మార్గముననే యింతవరకు గడచినది.

శాసన సభా మెన్నికలు యిట్టి ఒకటి రెండు గండములు గడచినవి. లోకల్ బోర్డులయందు దిడ్డిదారుల గుండా దూరుట కవకాశముంటచే మెట్లోగితము జరిగి పోయినది.

కానినేడు క్రొత్త చట్టప్రకారము దిడ్డిదారులు మూతబడినవి. కావున యెట్టివాడును ముఖద్వారముగుండనే పోవలసివచ్చినది. దీనిగుండా పోవునపుడు ప్రశ్నకునికి, గోత్ర, సూత్రములు చెప్పవలసిన అవసర మేర్పడినది. యిందులో స్వార్థపరులగు జమీందారులు చిక్కుపడి సిగ్గుతో తలవంచు కొనుచున్నారు. వీరు నేటి మధ్యాహ్నమువరకు చేసినది రయితును సర్వ నిర్బంధముల పాలుజేసి, సర్వసంపదల నపహరించి శల్యా వశిష్టునిగ జేయుటయే. యీ కారణముచే తనే నేడు రయితుల పక్షమున తాము పెత్తనము జేతుమని వారిముందర మొగమెత్తి చెప్పలేక, లజ్జితులయి పోవుచున్నారు.

ఈకారణము చేతనే నేడు కుమారరాజాగారు జిల్లాబోర్డు పెత్తనదారుగా వచ్చుటకు స్థానము దొరకలేదు. నిన్నటి మధ్యాహ్నము వరకు వెంకటగిరిచుట్టు ప్రక్కల పల్లెల రయితులను సాగుచున్నది గదాయని తీవ్రనిర్బాంధముల పాలుజేసి, రయితు పసుధనమును సర్వబాధలకు లోనుజేసి శాశ్వతముగా రయితుల సానుభూతిని గోల్పోవుటచే వెంకటగిరి సర్కిలునందు నిలుచుటకు అవకాశము లభింపదాయను.

వెంకటగిరి తూర్పున మూడుమైళ్ళలోగల శిద్దాగుంట సర్కిలులో నిలుచుటకు కొన్నిచిక్కులు యెదుర్కొన్నవి. శిద్దాగుంట, నిడిగల్లు మొదలగు 24 గ్రామాలు ధాన్యపు రేట్లుగలిగి అధ్వాన్నపు పరిపాలనా చక్రము క్రిందపడి పూర్తిగా నలిగిపోయి గత్యంతరములేక, చెప్పుకొంటె దిక్కు-మొక్కు విచారించు దోవలేక, ధాన్యపురేటును రొక్క రేటుకు మార్పించుకొనుటకు కోర్టులో దావాలువేసిరి. కొన్ని కారణాంతరములచేతను, బలవంతుడగు జమీందారుతో పోరలేకను, మధ్యవర్తులు చెప్పినప్రకారము పూర్వపు రేటులో కొంత తగ్గించి ధాన్యమేచెల్లించుటకు రయితులు ఒప్పుకొనిరి. అప్పట్లో రయితును భూలోకస్వర్గమునకు మెట్లుపెట్టెదమని అనాల్లునిబిమములు ఆనందార్ద్ర నోలలాడించిరి. ఇతరులో 24 గ్రామాల వారిని విడదీసి రయితులలో చీలికలు గల్పించిరి.

తర్వాత రెండు మూడు ఫసలీలు గడచినవి. 1333 ఫసలీ సైరుపండక నష్టకి పోయినది. రైతులు ముజరాకొరకు దేవిడీనాశ్రయించిరి. అప్పుడు దూరదృష్టిలేని యీ జమీందారు బిడ్డలు ఈరైతులతో, పూర్వము కోర్టు రాజీలో తగ్గించుకొన్న ధాన్యము తిరుగా హెచ్చించుకొన్నగానిము జరాలివ్వమనియు, కంచెలలోకి పశువుల పోనివ్వమనియు, నిర్బంధింపసాగిరి. వారిష్ట ప్రకారము లొంగువరకు పశువుల కంచెలకు పోనివ్వక బందెలదొడ్ల బెట్టిరి. రైతులు వందలాది బందెల జెల్లించిరి. సర్వనిర్బంధములను భరించి గత్యంతరములేక దేముడాయని యేడ్చుచువారు కోరిన ప్రకారము అంగీకరించి వ్రాసుకొన్న అగ్రిమెంట్లలో సంతకముల బెట్టిరి.

నాకు ఒక్క-నిడిగల్లు గ్రామము మాత్రము మూడు వందలవరకు కంచె సిపాయి బత్తాల చెల్లించి కుమారరాజాగారి వద్దకు వెళ్లి "మహానుభావా! మీరు కోరిన ప్రకారము తిరుగా ధాన్యపురేట్లు హెచ్చించుటకు వప్పుకొన్నాము. తమరు నిర్ణయించిన కంచెకాపుదారీ బత్తాలు గట్టుకొన్నాము. మమ్ముల అవిధేయుల లీస్టులోనుండి తొలగించనైన తొలగించండి." అని నిడిగల్లు కాపులు 90 మంది మోటారుకడ్డముగా రోడ్డులో పడగా వారివంక కన్నెత్తైనను జూడక మోటారును ప్రక్కగా తిప్పించుకొనిపోయిరి. ఆపిర్కాలోనే తిరుగా తాను జిల్లాబోర్డుకు నిలుచుటచే తనరైతే, గత పన్నెండు యేండ్ల సర్వనిర్బంధనలచే అశోకవనమున సీతబోలె గత్యంతరము గానక కాలమున కెదురు జూచుచు ధైర్యముతో నిలచియున్న రైతే, ఒకప్పుడు జమీందారు సర్వదౌష్ట్యములకు నిలయమగు వెంకటగిరిలో తిండి దొరకకుండగను, ఎస్టేటువారు తనమీద పెట్టిన క్రిమినలు కేసులలో తనపక్షము వాదించుటకు వచ్చిన నెల్లూరు వకీలుకు బండి సైతము కట్టకుండ జేసినను లొంగని రైతే, ఎస్టేటువారు హెచ్చించిన కంచెపుల్లరి కట్ట లేక గ్రామస్తులేకమైనప్పుడు 72 మంది గ్రామస్తులను చీలదీసి అక్రమ అన్యాయదావాల బెట్టి యేకాకిని జేసినప్పుడు న్యాయము, ధర్మము, అను రెండు పదముల నేనమ్మి కొని అన్ని కేసులలో నుజయమొంది చుట్టు ప్రక్క గ్రామాల ప్రజల సానుభూతిని సంపాదించుకొన్న అత్తివరము వాస్తవ్యుడు పుత్తేటి నారాయణరెడ్డియను రయితే పోటీకి నిలబడెను. ఆపిర్కాలో రయితులకు తాము జేసిన చెడుపులు, పుత్తేటి నారాయణరెడ్డిగారికి ప్రచారకులుబోలె యుపకరించెను, రయితుల ముఖముజూచి ఓట్లడుగుటకు కుమారరాజాగారికి మొగముచెల్లలేదు. అధికార్ల మూలకమున ఆహ్రింతపు కథవిని యున్నవాడగుటచే లాభములేదని తీర్మానించు కొనెను.

దర్శి రయితులుగూడ వీరి త్యాగశీలనమును గుర్తెరుగని వారుకాదు.

కాబట్టి కుమారరాజాగారు తమ అధికారుల దౌష్ట్యములనమ్మి యీదర్శి సర్కిలులో నిలుచుట కేవల మనుచితమని సాహసించి చెప్పకతప్పదు. కట్టుముట్టరొచ్చుజేసుకొన్న తమసంకుచిత రాజనీతికి చింతిలుచు తమస్వస్థలపు రయితులనే చెంగదోలు కొనక రాజీకి శిద్ధముగనున్న వారికనిసిపు కోర్కెల మన్నించి యింటిలోపోరు లేకుండా జేసుకొందురనియు, దర్శిసర్కిలులో మేము ఓడగొట్టినామన్న అపకీర్తికంటె తామే ఉపసంహరించు కొన్నారన్న కీర్తిప్రతిష్టలకే తావిత్తురనియు కోరుచున్నాను.

ఇవి నాయొక్కడి కోర్కెలుగావు. అందరిభావాలను క్రోడీకరించి వ్రాసినసాహసమునకు మన్నించ ప్రార్థితులు.

చిత్తగింపవలెను.

"దర్శిరైతు"

నకలుమందులను చూచి మోసపోకుడు

నలుబది సంవత్సరములుగా ప్రఖ్యాతిజెందినది. కేవలము బాధసాధని.

తలనొప్పుల మాన్పును, వాయుపోటుల బాపును, పార్శ్వపు నొప్పుల బారదోలును, పోట్ల పోగొట్టును, బెణుకుల ఛేదించును, వాపుల రూపుమాపును, దగ్గును దగ్గించును, కురుపును తొలగించును.

మద్రాసు, మైసూరు రాష్ట్రములకు
మొత్తపు ఏజంట్లు,
ప్యాం అండు కంపెని,
6, బందరువీధి, మద్రాసు.

అమృతాంజనం డిపో,
మద్రాసు, బొంబాయి,
కలకత్తా.

కృషీవలుడు

ఆంధ్రదేశ వ్యవసాయకుల పాలిటిసురభి
తిరుత్తణి జమీన్ రైతు మహాజన సంఘము
యాజమాన్యమున
1, 15 తేదీల వెలువడు పక్షపత్రిక.
సం॥ చందా 2 రూపాయలు మాత్రమే.
పత్రిక కార్యాలయము
నెం 6. లాయర్ చిన్నతంబి మొదలివీధి.
సౌకార్ పేట, మద్రాసు.

త్రిలింగ

మత, సాంఘిక, ఆర్థిక, రాజకీయ పారిశ్రామిక విషయముల నిష్పక్షపాతముగ చర్చించు వార పత్రిక. సంవత్సర చందా రూ 2½/- మాత్రము. వలయువారీ క్రింది చిరునామాకు వ్రాసి తెప్పించుకొనుడు.

మేనేజరు 'త్రిలింగ' 323, హైరోడ్డు,
తండియార్పేట, మద్రాసు.

గ్రాండ్ నేషనల్ స్వీప్ (లాటరీ)

ఐరిష్‌హాస్పిటల్ ట్రస్టు లిమిటెడ్ వారిచే నడుపబడు చున్నది

24 మార్చి 1933 సం॥ తేదీని ఐన్‌ట్రీ (ఇంగ్లాండు)లో పందెము జరుగును.

చందా, మామూలు మెయిలు ది 2—2—33 సం॥ వరకు టిక్కెట్టు 1-కి రు 7—12—0 లు.

లింకోలన్ షైర్ హ్యాండీ క్యాప్ స్వీపులాటరీ.

మ్యూచుయల్ క్లబ్బ వారిచే నడుపబడుచున్నది.

22 మార్చి 1933 సం॥ తేదిని లింకోలన్ (ఇంగ్లాండు)లో పందెము జరుగును.

చందా, మామూలు మెయిలు ది 22—2—33 సం॥ వరకు టిక్కెట్టు 1-కి రు 4—12—0 లు.

ఈపై రెండుక్లబ్బులటిక్కెట్లున్ను దిగువ విలాసదారుయొద్ద దొరుకును. గనుక సొమ్ముతో ఆర్డర్లుపంపుకోవచ్చును.

టీ. వి. రెడ్డి,
అధికారమును పొందిన ఏజెంటు.

రాజమండ్రి (తూర్పు గోదావరిజిల్లా.)

సంపాదకుడు, ముద్రాపకుడు, ప్రకాశకుడు, నెల్లూరు, వెంకటాద్రినాయుడు, జమీందారీ రైతు ముద్రణాలయం, గాంధిచౌక్, నెల్లూరు.